సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 27 । జూలై । 2025



కలెక్టరేట్‌కు ఇబ్బందులు

ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనం చిన్నపాటి వర్షానికే కురుస్తోంది. నిర్మాణంలో లోపాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. 8లో▸



హామీలు అమలు చేయండి

పీఆర్‌సీ అమలు చేయాలని, పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ కోరారు. 8లో▸



సత్వరం పరిష్కరించాలి

కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు కృషి చేయాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయ మూర్తి కరుణకుమార్ అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ఇండియన్ ఎకనామిక్స్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

షాద్‌నగర్: మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ సామ రవీందర్‌రెడ్డి రాసిన ఇండియన్ ఎకనామిక్స్ పుస్తకాన్ని శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన వారికి జాతీయ స్థాయి అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి రాసిన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ పుస్తకం సివిల్స్, గ్రూప్స్, పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న వారికి ఎంతో ఉపయోగపడుతుందని రవీందర్‌రెడ్డి తెలిపారు. పుస్తకాన్ని సీఎం చేతుల మీదుగా ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు.

గోశాల పనులు వేగవంతం



ఫెన్సింగ్ పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్

మొయినాబాద్: గోశాల పనులను అధికారులు వేగవంతం చేశారు. వర్షం పడుతున్నా ఆపకుండా కొనసాగిస్తున్నారు. ముందుగా రైతులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే భూమిని జేసీబీలు, డోజర్లతో చదును చేశారు. అమ్డాపూర్ రోడ్డు నుంచి ఎనికేపల్లి వరకు ఈ భూముల నుంచి వెళ్తున్న రోడ్డును 30 అడుగుల వెడల్పుతో వదిలేసి భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసే పనులు చేపడుతున్నారు. మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ పనులను పర్యవేక్షిస్తున్నారు. హెచ్‌ఎండీఏ అధికారులు దగ్గరుండి గోశాల పనులు చేపడుతున్నారు. భూముల వద్దకు ఎవరూ రాకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మరో వైపు రైతులకు నాలుగైదు రోజుల్లో ఇళ్ల పట్టాలు ఇచ్చి స్థలాలను అప్పగించేందుకు రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఈనెల 31 వరకు 'దోస్త్'

చేవెళ్ల: డిగ్రీలో ఇంకా అడ్మిషన్లు పొందని వారికోసం దోస్త్ వెబ్‌సైట్ ద్వారా అడ్మిషన్ల ప్రత్యేక ఫేజ్ ప్రారంభమైందని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆగస్టు 3న సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. 4వ తేదీ నుంచి కళాశాలకు హాజరు కావాల్సి ఉంటుందని చెప్పారు. బీకాం (కంప్యూటర్ అప్లికేషన్, జనరల్), బీఏ, బీఎస్సీ (ఫిజికల్ సైన్స్, లైఫ్ సైన్స్) కోర్సులు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. ఇతర వివరాలకు 83281 76599, 94901 17490 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేషన్ కమీషన్ ఇవ్వండి



సివిల్ సప్లై కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

మహేశ్వరం: రేషన్ డీలర్లకు రావాల్సిన ఐదు నెలల ఉచిత బియ్యం పంపిణీ కమీషన్ విడుదల చేయాలని రేషన్ డీలర్ల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులిమామిడి లక్ష్మీనారాయణ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సివిల్ సప్లై కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ఏప్రిల్, మే, జూన్, జూలై, ఆగస్టు నెలల్లో అందించిన ఉచిత రేషన్ బియ్యానికి కమీషన్ విడుదల చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ షాపుల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యాన్ని ప్రభుత్వం తిరిగి తీసుకోవాలన్నారు. రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డిమళ్ల హన్మాండ్లు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భానుచందర్, పలువురు రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో సత్తా

దుద్యాల్: అండర్ – 14 జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో దుద్యాల్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన తూర్పు త్రివిక్రమ్ యాదవ్ బంగారు పతకం సాధించాడు. కేంద్రీయ విద్యాలయ సంగతమ్ ఆధ్వర్యంలో పంజాబ్ రాజధాని చండీగఢ్‌లో ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు 54వ జాతీయ స్పోర్ట్స్ మీట్ పోటీలు జరిగాయి. పోటీల్లో విజేతగా నిలిచి బంగారు పతకం సొంతం చేసుకున్నాడు.

జలకళ

నాలుగు రోజులుగా జిల్లాలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. జంట జలాశయాలకు భారీగా వరద పోటెత్తుతోంది. నిన్న మొన్నటి వరకు పాతాళానికి పడిపోయిన భూగర్భ జలాలు ప్రస్తుతం పైకి ఉబికి వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 2,127 చెరువులు, కుంటలు ఉండగా, వీటి కింద 71 వేలకుపైగా ఎకరాల ఆయకట్టు ఉంది. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండడం.. చెరువులు, కుంటలు మత్తడి దూకుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నిండుగా హిమాయత్‌సాగర్ జలాశయం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు

- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- జంట జలాశయాలకు భారీగా వరద
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో కీలకమైన హిమాయత్‌సాగర్‌కు వరద పోటెత్తుతోంది. 2.970 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టులోకి శనివారం 450 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. జలాశయం ఫుల్ ట్యాంక్ లెవల్ 1,763.50 అడుగులు కాగా, శనివారం ఉదయం వరకు 1,761.30 అడుగుల వరకు నీరు చేరింది. వరద ఇలాగే వచ్చి చేరితే ఒకటి రెండు రోజుల్లో గేట్లు తెరుచుకునే అవకాశం ఉంది. ఇప్పటికే అధికారులు లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, మూసీ, ఈసీ వాగుల్లో కొనసాగుతున్న వరదలను నిరంతం పర్యవేక్షిస్తున్నారు. ఉస్మాన్‌సాగర్ జలాశయం ఫుల్ ట్యాంక్ లెవల్ 1,790 అడుగులు కాగా, ప్రస్తుతం 1,782 అడుగులుగా ఉంది. ఇక ఇబ్రహీంపట్నం, రావిర్యాల చెరువుల్లోకి సైతం వరద నీరు వచ్చి చేరుతుండటంతో క్రమంగా నీటిమట్టం పెరుగుతోంది.

రైతన్న దిగులు తీరేలా..

వర్షాలు లేక నిన్న మొన్నటి వరకు దిగులు చెందిన రైతులు వరుసగా కురుస్తున్న వర్షాలకు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువుల కింద కాలువలు పారుతుండటం, బోర్లు ఆగకుండా పోస్తుండటంతో పొలాలను సిద్ధం చేస్తున్నారు. నందిగామ, జిల్లెడు చౌదరిగూడ, కొందుర్గు, షాబాద్, చేవెళ్ల, మొయినాబాద్, తలకొండపల్లి, కేశంపేట, కడ్తాల్, ఆమనగల్లు, మాడ్గుల, యాచారం, మంచాల తదితర మండలాల్లోని రైతులు వరి నాట్లకు సిద్ధమయ్యారు. తాజా వర్షాలతో ఇప్పటికే వేసిన పత్తి, కంది సహా కూరగాయల పంటలు ఏపుగా, పచ్చగా పెరుగుతున్నాయి.

శిథిల భవనాలతో జాగ్రత్త

గ్రామీణ ప్రాంతాల్లో పలువురు పేదలు ఇప్పటికీ శిథిల భవనాల్లో నివసిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పెచ్చులూడి పడుతున్న పాత భవనాల్లో నివసించడం ఏమాత్రం సురక్షితం కాదని అధికారులు హెచ్చరిస్తున్నారు. మట్టి మిద్దెలు, గోడలు కూలే ప్రమాదం ఉందని, వెంటనే వాటిని ఖాళీ చేయాల్సిందిగా ఇప్పటికే రెవెన్యూ, పురపాలక, పంచాయతీరాజ్‌శాఖల అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వరదలు, ఇతర ముంపు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తమంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఎమర్జెన్సీ కాల్ (040–23237416) సెంటర్ ఏర్పాటు చేశారు. వర్షాలకు విద్యుత్ వైర్లు తెగిపడి షాకుకు గురయ్యే ప్రమాదం ఉందని విద్యుత్ స్తంభాలు, స్టేవైర్లను తాకరాదని డిస్కం ఇంజనీర్లు హెచ్చరిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండండి

భారీ వర్షాలు కురుస్తున్నందున అత్యవసరమైతే తప్ప ప్రజలెవరూ బయటకు రావద్దని కలెక్టర్ నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిథిలావస్థ భవనాల్లో ఉండకూడదని, పిల్లలు, వృద్ధులు, పెద్దలు బయటకు రాకపోవడం మంచిదని తెలిపారు. వాగులు, చెరువులు వద్దకు వెళ్లొద్దని, జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. డ్రైనేజీ, నాలాలు పొంగిపొర్లే ప్రాంతాలు, వరద పారుతున్న సందర్భాల్లో అప్రమత్తం కావాలన్నారు.



షాబాద్: మల్లారెడ్డిగూడలో కళకళలాడుతున్న మొక్కజొన్న పంట

వర్షపాతం నమోదు ఇలా..

జిల్లాలో శనివారం 1.77 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. శంకర్‌పల్లిలో 2.70, గండిపేటలో 2.10, రాజేంద్రనగర్ 2.09, కేశంపేట 2.06, నందిగామ 2.38, కొత్తూరు 2.14, కొందుర్గు 2.75, చౌదరిగూడ 2.07, మొయినాబాద్‌లో 2.13 సెంటీమీటర్ల చొప్పున కురిసింది. షాబాద్‌లో 1.97, చేవెళ్ల 1.98, శేరిలింగంపల్లి 1.86, కందుకూరు 1.42, తలకొండపల్లి 1.30, యాచారం 1.38, అబ్దుల్లాపూర్‌మెట్ 1.51, హయత్‌నగర్ 1.59, సరూర్‌నగర్ 1.80, బాలాపూర్ 1.39, మంచాల 1.04, ఇబ్రహీంపట్నం 1.07, మాడ్గుల 1.23, ఆమనగల్లులో 1.33 సెంటీమీటర్ల చొప్పున నమోదైంది. కడ్తాల్‌లో అతి తక్కువగా 0.78 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

❖ పడలేం పాట్లు .. అందుకే వరినాట్లు



కందుకూరు మండలం వావిళ్లకుంటతండా నుంచి మీర్‌ఖాన్‌పేట మీదుగా నస్దిక్‌సింగారం గ్రామాల వరకు ఉన్న రహదారి రాకపోకలకు వీలులేని విధంగా మారింది. రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో గుంతల్లో నీరు నిలిచి అధ్వానంగా తయారైంది. దీంతో శనివారం మీర్‌ఖాన్‌పేట గ్రామస్తులు ఆ రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. – కందుకూరు

❖ సారూ.. దరఖాస్తులు పరిశీలించరూ




డీఎస్‌ఓ కార్యాలయంలో క్యూకట్టిన దరఖాస్తుదారులు

రేషన్ కార్డుల కోసం బారులు

ఇబ్రహీంపట్నం రూరల్: రేషన్ కార్డుల కోసం జనం బారులు తీరుతున్నారు. తహసీల్దార్ కార్యాలయాలతో పాటు కలెక్టరేట్‌కు క్యూ కడుతున్నారు. రెండు నెలలుగా వేలాదిగా దరఖాస్తు చేసుకున్నారు. మీ సేవా కేంద్రాల నుంచి మండల తహసీల్దార్ కార్యాలయాలకు కుప్పలుతెప్పలుగా దరఖాస్తులు వచ్చి చేరాయి. వాటికి తహసీల్దార్ కార్యాలయాల్లో ఆమోదం తెలపాలి. కానీ అధికారుల నిర్లక్ష్యంతో వేల సంఖ్యలో పెండింగ్‌లో ఉంటున్నాయి. దీంతో దరఖాస్తుదారులు నేరుగా కలెక్టరేట్‌లోని డీఎస్‌ఓ కార్యాలయానికి వెళ్తున్నారు. 'సార్ .. మేడం మా దరఖాస్తులు పరిశీలించండి' అంటూ విన్నవిస్తున్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు



లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, చిత్రంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

- పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- కొత్త రేషన్‌కార్డుల పంపిణీలో మంత్రి శ్రీధర్‌బాబు

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రేషన్‌కార్డులు ఇవ్వాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని ఐటీశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పెద్దఅంబర్‌పేటలోని తార కన్వెన్షన్ హాల్లో శనివారం నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి హాజరయ్యారు. లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో పేదలకు రేషన్ కార్డులు, ఇళ్లు అందించడంలో విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్నబియ్యం, ఇందిరమ్మ గృహనిర్మాణం, రూ.10 లక్షల వరకు వైద్య కవరేజీతో ఆరోగ్యశ్రీ వంటి పథకాల అమలును గుర్తు చేశారు. గతంలో రేషన్ దుకాణాల్లో పంపిణీ చేసిన దొడ్డు బియ్యాన్ని దొడ్డిదారిన అమ్ముకుంటూ సొమ్ము చేసుకునే వారని, నేడు సన్నబియ్యం అందించి పేదల కడుపు నింపుతున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే మల్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఈ ప్రాంత అభివృద్ధికి కావాల్సిన నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ బి.సుదర్శన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డిల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ బీజేపీలో విభేదాలు లేవు

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు



రాంచంద్రరావును గజమాలతో సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

కొత్తూరు: షాద్‌నగర్ నియోజకవర్గంలో నాయకుల మధ్యన ఎలాంటి విభేదాలు లేవని, అవసరం వచ్చినప్పుడు అందరూ పార్టీకోసం పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు అన్నారు. శనివారం నారాయణపేట జిల్లా పర్యటనకు వెళ్తున్న ఆయనకు మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్ వద్ద ఘన స్వాగతం పలికారు. శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి పార్టీ బలోపేతంతోపాటు నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్, జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, నాయకులు అందె బాబాయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.


❖ గుంతలు చూసి.. పూడ్చివేసి



జేసీబీ సాయంతో గుంతలను పూడ్చివేయిస్తున్న పోలీసులు

శంకర్‌పల్లి మండల పరిధిలోని మోకిల చౌరస్తా నుంచి కొండకల్ వెళ్లే మార్గంలో రోడ్డుపై పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పలుమార్లు ప్రమాదాలు సైతం చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో మోకిల పోలీసులు స్పందించారు. శనివారం గుంతల్లో మొరం వేసి, తాత్కాలికంగా పూడ్చివేశారు. పోలీసుల పనితీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.
– శంకర్‌పల్లి

పనుల్లో అలసత్వం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

కందుకూరు: గ్రామాల్లో ప్రభుత్వం నిర్దేశించిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, అలసత్వం తగదని డీపీఓ సురేష్‌మోహన్, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, డిప్యూటీ సీఈఓ రంగారావు అన్నారు. మండల కేంద్రంలోని నవారు బాల్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో శనివారం డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వన మహోత్సవంలో భాగంగా లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని అన్నారు. వరుసగా వర్షాలు కురుస్తున్న ప్రస్తుత తరుణంలో పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం తగదని తెలిపారు. తడి, పొడి చెత్తను వేరు చేయించి డంపింగ్ యార్డులకు తరలించాలని సూచించారు. సిటిజెన్ సర్వీసెస్ గడువులోపు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ డీసీ నాయక్, అదనపు డీఆర్‌డీఓ సుభాషిణి, డీఎల్‌పీఓ లక్ష్మీనారాయణ, కందుకూరు, మహేశ్వరం, కడ్తాల్, తలకొండపల్లి, ఆమనగల్లు ఎంపీడీఓలు సరిత, శైలజ, సుజాత, శ్రీకాంత్, వినోద, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జగన్‌మోహన్‌రెడ్డి, ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

విపత్తును ఎదుర్కొనేలా..

- మున్సిపాలిటీల్లో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీలు
- మున్సిపల్‌తోపాటు 8 శాఖలకు చెందిన 20 మంది సభ్యులతో మాన్‌సూన్ టీం
- వర్షాకాలం లోతట్టు, సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు చర్యలకు సిద్ధం



మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

మీర్‌పేట: వర్షాకాలం నేపథ్యంలో జిల్లాలోని ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో లోతట్టు, సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టేందుకు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ (మాన్‌సూన్ టీమ్)లు ఏర్పాటయ్యాయి. ఈ కమిటీలో ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు, ఏఎంసీ, టీపీఓ, డీఈ, శానిటేషన్ అధికారులతో పాటు మరో 8 శాఖలకు చెందిన అధికారులు సభ్యులుగా ఉన్నారు. రెవెన్యూ నుంచి స్థానిక మండల తహసీల్దార్, ఉప తహసీల్దార్, హైడ్రా అధికారి, ఇరిగేషన్ డీఈ, ఏఈ, స్థానిక పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్, విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈలు, అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్, ఆర్‌అండ్‌బీ ఏఈలతో కూడిన 20 మంది సభ్యులతో వాట్సాప్ గ్రూప్‌లను ఏర్పాటు చేశారు.

సమస్యలు తలెత్తకుండా ..

ఆయా మున్సిపాలిటీల్లో ప్రమాదకరంగా ఉన్న చెరువులు, మ్యాన్‌హోల్స్, డ్రైనేజీ, లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించి వర్షాకాలంలో సమస్యలు తలెత్తకుండా మాన్‌సూన్ టీం ముందస్తు చర్యలు చేపట్టనుంది. ఇప్పటికే మున్సిపాలిటీల్లో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. ఏదైనా సమస్య వస్తే అప్పటికప్పుడు పరిష్కరించేందుకు అత్యవసర బృందాలను అందుబాటులో ఉంచారు. మూడు నెలల (వర్షాకాలం పూర్తయ్యే) వరకు ఈ టీం అప్రమత్తంగా ఉంటూ పని చేయనుందని మున్సిపల్ శాఖ అధికారులు తెలిపారు.

సిద్ధంగా బృందాలు



ఇప్పటికే అన్నిశాఖల అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశాం. నాలాలు, డ్రైనేజీల్లో పూడిక తీత చేపట్టాం. గతంలో జరిగిన సంఘటనల దృష్ట్యా అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఐదు బృందాలను సిద్ధంగా ఉంచాం.

– ఎస్.నాగేందర్‌రెడ్డి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్, మీర్‌పేట కార్పొరేషన్

ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌కు ఇబ్బందులు



కలెక్టరేట్ మొదటి అంతస్తు నుంచి కురుస్తున్న వర్షపు నీటిని పట్టేందుకు పెట్టిన బకెట్

కురుస్తున్న భవనం

- గోడలకు చెమ్మ, రాలుతోన్న పెయింటింగ్

ఇబ్రహీంపట్నం రూరల్: గత ప్రభుత్వం నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనం చిన్నపాటి వర్షానికే కురుస్తోంది. కలెక్టరేట్ బిల్డింగ్ నిర్మాణంలో లోపాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. గోడలకు చెమ్మ వచ్చి పెయింటింగ్ రాలిపోతోంది. మొదటి అంతస్తులో గోడలకు పగుళ్లు వచ్చి నీరు చేరి ఫైళ్లు తడిసి ముద్దవుతున్నాయి. బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో, సహకార శాఖ జిల్లా కార్యాలయంలో, జిల్లా సమాచార శాఖ కార్యాలయంలో గోడల నుంచి నీరు చేరుతుంది. స్లాబ్ నుంచి వచ్చే నీటిని బకెట్లు నింపుతున్నారు.



కారిడార్‌లో పాడైన సీలింగ్

అప్పు చెల్లించినా..
చంపుతామని బెదిరిస్తున్నారు

మోకిల పీఎస్‌లో బాధితుడి ఫిర్యాదు

శంకర్‌పల్లి: తీసుకున్న అప్పు వడ్డీతో సహా చెల్లించినప్పటికీ తన భూమిని రిజిస్ట్రేషన్ చేయకపోగా చంపుతామంటూ బెదిరిస్తున్నారని ఓ వ్యక్తి శనివారం మోకిల పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మోకిలకు చెందిన ఫరీద్ కుటుంబ అవసరాల నిమిత్తం 2021లో తన భూమిని హైదరాబాద్‌కి చెందిన సునీల్ కుమార్ అహుజా, అశీష్‌అహుజాలకు రిజిస్ట్రేషన్(తాకట్టు) చేసి, రూ.17 కోట్లు అప్పుగా తీసుకున్నాడు. 2022 డిసెంబర్‌లో వడ్డీతో కలిసి రూ.22 కోట్లు చెల్లించాడు. అనంతరం భూమిని తిరిగి రిజిస్ట్రేషన్ చేయాలని కోరగా కాలయాపన చేస్తూ వచ్చారు. మొదటి నుంచి ఈరోజు వరకూ ఫరీద్ కబ్జాలో ఉన్నాడు. శుక్రవారం సునీల్, అశీష్ భూమి వద్దకు చేరుకుని అతనితో గొడవ పడ్డారు. ఫొటోలు, వీడియోలు తీస్తూ చంపేస్తామని బెదిరించారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వీరబాబు తెలిపారు.

ధూల్‌పేట్‌లో గంజాయి పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: ఎక్సైజ్ పోలీసులు ధూల్‌పేట్‌లో దాడులు నిర్వహించి 1.52 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఈ కేసులో నిఖిల్ సింగ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఆకాశ సింగ్ అనే మరో నిందితుడిపై కేసు నమోదు చేశారు.

వానాకాలం.. ప్రయాణం పైలం

- తప్పనిసరైతేనే బటయకు రావాలి
- చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం



చేవెళ్ల: వర్షకాలంలో వాహన చోదకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని లేదంటే రోడ్డు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంటుందని చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం అన్నారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ వాహనదారులకు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

- వర్షం కురిసే సమయంలో రోడ్డుకు తడిగా ఉండి వాహనాలు స్కిడ్ అవుతాయి. వాహనాల వేగం తగ్గించి డ్రైవ్ చేయాలి
- ఎప్పటికప్పుడు బ్రేకులు సరి చూసుకోవాలి.
- టైర్లలో సరిపడా గాలితో గ్రిప్‌ను తనిఖీ చేసుకోవాలి. గ్రిప్‌లు కోల్పోతే బ్రేక్ వేసినప్పుడు వాహనాలు అదుపుతప్పుతాయి.
- లైట్లు వెలుగుతున్నాయా లేదా చూసుకోవాలి.



వర్షం పడుతున్న సమయంలో హెడ్‌లైట్లు వేసుకుని వాహనాలు నడిపించాలి దీంతో ఎదుటి వాహనాలకు మన వాహనం కనిపిస్తోంది.

- రోడ్డుపై నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో జాగ్రత్తగా ఉండాలి. నీళ్లున్నందున లోతు అంచనా తెలియక ప్రమాదాల బారిన పడుతుంటారు. వాహనాలు సైతం పాడవుతాయి.
- వాహనాల మధ్య దూరం పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయి. ఎక్కువ వర్షం కురిస్తే వాహనాలను రోడ్డు పక్కన నిలుపుకోని తగ్గిన తర్వాత ప్రయాణించాలి.
- తప్పనిసరైతే బయటకు రావాలి. లేదంటే ప్రయాణాలు వాయిదా వేసుకోవడం ఉత్తమం.
- ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలి.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

కొత్తూరు: మండల పరిధిలో శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతి చెందారు. శనివారం సీఐ నర్సింహారావు తెలిపిన ప్రకారం.. మహేశ్వరం మండలం సుభాష్‌పూర్ గ్రామానికి చెందిన వర్కల సాయిరాం (21) బొల్లు వెంకటేశ్ శుక్రవారం అర్ధరాత్రి కారులో మాణిక్యమ్మగూడ నుంచి పెంజర్ల మీదుగా స్వగ్రామానికి వెళ్తున్నారు.ఈ క్రమంలో గ్రామశివారులోని మూలమలుపు వద్దకు రాగానే కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన సాయిరాం అక్కడిక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్‌ను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి సుమతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆగిఉన్న డీసీఎంను ఢీకొట్టిన బైక్

రోడ్డు నిబంధనలకు విరుద్ధంగా నిలిపిన ఓ డీసీఎంను శంషాబాద్ మండలం పెద్దతూప్ర గ్రామానికి చెందిన చిటికెల పవన్(24) తన బైకుతో ఢీకొట్టాడు. శుక్రవారం రాత్రి పవన్ షాద్‌నగర్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. కొత్తూరు పట్టణం పెంజర్ల కూడలి సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు పక్కన నిలిపిన డీసీఎం వ్యాన్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలైన పవన్ అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతుడి వద్ద లభ్యమైన్ ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై మృతుడి అన్న రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.

రైతులకు సరిపడా యూరియా

ఏడీఏ శోభారాణి



మాడ్గుల ఆగ్రో రైతు సేవా కేంద్రంలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న శోభారాణి

ఆమనగల్లు: రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని ఆందోళన చెందవద్దని ఆమనగల్లు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ ఏడీఓ శోభారాణి చెప్పారు. శనివారం ఆమె డివిజన్ పరిధిలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలలో సహకార సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాల్లోని యూరియా నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ.. అన్ని సింగిల్‌విండో కార్యాలయాల ద్వారా అన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా, డీలర్ల ద్వారా రైతులకు అందిస్తున్నట్లు వివరించారు. రైతులకు అవసరమైన ఎరువుల వివరాలు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి అందిస్తున్నామని ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరా చేస్తుందని ఆమె చెప్పారు. రైతులు యూరియా పంపిణీ విషయంలో ఆందోళన చెందకుండా అవసరమైన ఎరువులను తీసుకుపోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు శ్రీనివాస్‌గౌడ్, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయండి



ఆమనగల్లు జెడ్పీహెచ్‌ఎస్(బాలికల)లో సభ్యత్వం అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

ఆమనగల్లు: ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ అమలు చేయాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యాయులకు ఇచ్చిన ఎన్నికల హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సర్దుబాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, పెండింగ్ బిల్లుల కోసం ప్రతీనెలా రూ.700 కోట్లు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు కృష్ణారెడ్డి, భార్గవి, ఏఐఎస్‌టీఎఫ్ నాయకులు కసిరెడ్డి పురుషోత్తంరెడ్డి, పరమేశ్, సంఘం వివిధ మండలాల అధ్యక్షులు కసిరెడ్డి అశోక్‌రెడ్డి, క్రాంతికుమార్, రజాక్ పాల్గొన్నారు.

గొర్రెల మందపై వీధికుక్కల దాడి

- పది జీవాలు మృతి
- మరో 40 గొర్రెలకు గాయాలు

నందిగామ: ఇటీవల రంగాపూర్‌లో నాటుకోళ్ల ఫామ్ ఘటన మరువకముందే శనివారం మండల కేంద్రంలో తాజాగా గొర్రెల మందపై వీధి కుక్కలు దాడికి పాల్పడ్డాయి. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బాలయ్య గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. రోజుమాదిరిగానే మంద వద్ద నిద్రించిన బాలయ్య ఉదయం ఇంటికి వెళ్లి వచ్చే వరకు సుమారు 15 వీధికుక్కలు మందపై దాడి చేశాయి. ఈ ఘటనలో పది గొర్రెలు మృత్యువాత పడగా మరో 40 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. విషయం తెలుసుకున్న పశువైద్య సిబ్బంది లింగమయ్య ఘటన స్థలానికి చేరుకొని గాయపడిన జీవాలకు చికిత్స అందించారు. సుమారు రూ. లక్ష వరకు నష్టపోయానని బాధితుడు బాలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. వీధి కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.



గొర్రెల కళేబరాలు

నకిలీ సర్టిఫికెట్ల ముఠాగుట్టు రట్టు

కేపీహెచ్‌బీకాలనీ: కన్సల్టెన్సీ ముసుగులో నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి విద్యార్థులకు అంటగడుతున్న ముఠా గుట్టు రట్టయింది. శంషాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు కన్సల్టెన్సీ నిర్వాహకులిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన ఆకాశపు హరీష్ కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన మావూరి మహేష్‌లు భాగస్వాములుగా శ్రీ వ్యాస కన్సల్టెన్సీ పేరుతో వసంతనగర్ కాలనీలో కార్యాలయాన్ని ప్రారంభించారు. వీరు విదేశాలకు వెళ్లాలనుకునే విద్యార్థులకు ఎరవేసి నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తూ రూ.లక్షలు దండుకున్నారు. ఈ క్రమంలోనే పాపిరెడ్డినగర్‌లో నివాసం ఉండే పాత్తూరి సాయి వెంకట హర్షిత్ వ్యాస కన్సల్టెన్సీ ద్వారా రూ.మూడు లక్షలు చెల్లించి వీర్ బహదూర్ సింగ్ పూర్వాంచల్ యూనివర్సిటీ నుంచి బీటెక్ సర్టిఫికెట్ పొందాడు. ఆ సర్టిఫికెట్‌తో వెంకట హర్షిత్ ఎన్ని ఇంటర్వ్యూలకు వెళ్లినా రిజెక్ట్ అయ్యాడు. చివరకు అమెరికా వెళ్లేందుకు నానక్‌రామ్‌గూడలోని ఓ కన్సల్టెన్సీకి వెళ్లగా అక్కడ వారు అతని సర్టిఫికెట్స్ చూసి.. అవి నకిలీవని చెప్పడంతో పాటు వాటిని తీసుకుని వెనక్కు పంపించారు. దీంతో ఆందోళనకు గురైన హర్షిత్ శ్రీ వ్యాస కన్సల్టెన్సీకి వచ్చి జరిగింది చెప్పడంతో వారు ఆందోళన చెందవద్దని, మరో దేశం పంపిస్తామని నమ్మించారు. నెల రోజుల తరువాత శంషాబాద్ పోలీసులు హర్షిత్‌కు ఫోన్ చేసి అతని సర్టిఫికెట్స్ నకిలీవని, అవి ఎవరి ద్వారా వచ్చాయని ఆరాతీయగా అసలు గుట్టు రట్టయింది. దీంతో శంషాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు శ్రీ వ్యాస కన్సల్టెన్సీపై ఆకస్మిక దాడి చేసి విచారించగా శ్రీ వ్యాస కన్సల్టెన్సీ ద్వారా ఇప్పటి వరకు మొత్తం 46 మంది అభ్యర్థులకు సర్టిఫికెట్లు సిద్ధం చేసినట్లు తెలిసింది. వీరిలో 24 మంది అభ్యర్థులు నకిలీ సర్టిఫికెట్లు పొందగా, మిగిలిన 22 మంది పూర్తి డబ్బు చెల్లించకపోవడంతో వారికి సర్టిఫికెట్లు అందలేదు. నకిలీ సర్టిఫికెట్లు పొందిన 24 మందిలో 22 మంది అభ్యర్థులు ఇప్పటికే అమెరికా, యూకే, ఐర్లాండ్ వంటి దేశాలకు వెళ్లిపోయినట్లు గుర్తించారు. ప్రధాన నిందితులైన ఆకాశపు హరీష్, మావూరి మహేష్‌లను అదుపులోకి తీసుకోగా మరో నిందితుడు మోహన్ మాత్రం పరారీలో ఉన్నాడు. వీరి వద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్‌లు, ఒక డెస్క్‌టాప్ స్వాధీనం చేసుకుని కేపీహెచ్‌బీ పోలీసులకు శనివారం అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

కేసులు సత్వరం పరిష్కరించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి కరుణకుమార్

షాద్‌నగర్: కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు తగిన విధంగా కృషి చేయాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కరుణ కుమార్ అన్నారు. షాద్‌నగర్ కోర్టును శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. న్యాయవాదులు, న్యాయమూర్తులకు మధ్య మంచి సంబంధాలు ఉండాలని, అప్పుడే కేసుల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని అన్నారు. ప్రతి చిన్న విషయానికి గొడవలు పడి పోలీస్ స్టేషన్‌లు, కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. రాజీ మార్గాలను అన్వేషించి వివాదాలను పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి రవికుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సర్వవేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

కోర్టు భవనానికి మూడెకరాలు..

ఆమనగల్లు: ప్రస్తుతం కోర్టు కార్యకలాపాలు నిర్వహిస్తున్న భవనం అన్నింటికి అనుకూలంగా ఉందని ఇక్కడే మూడెకరాలు కేటాయించాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కరుణకుమార్ తహసీల్దార్ లలితకు సూచించారు. శనివారం ఆయన ఆమనగల్లులో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సందర్శించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప, ఆమనగల్లు బార్ అసోసియేన్ అధ్యక్షుడు యాదీలాల్, సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కరుణకుమార్‌ను గజమాలతో సత్కరించారు. అనంతరం కోర్టు పరిసరాలను, భవనాలను పరిశీలించారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కోర్టుకు ఐదెకరాల స్థలం కేటాయింపు, నూతన భవనం నిర్మాణం, సబ్ కోర్టు ఏర్పాటు తదితర విషయాలను జిల్లా జడ్జికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదీలాల్ వివరించారు. స్థలం కేటాయింపు అనంతరం భవనాల నిర్మాణానికి హైకోర్టుకు సిఫారసు చేస్తామని కరుణకుమార్ చెప్పా రు. ఈ కార్యక్రమంలో సీఐలు గంగాధర్, వేణుగోపాల్, జానకీరాంరెడ్డి, ఎస్‌ఐలు వెంకటేశ్, శ్రీకాంత్, శేఖర్, చంద్రశేఖర్, ఏపీపీ కార్తీక్, బార్ అసోసియేషన్‌సభ్యులు జగన్, ఆంజనేయులుయాదవ్, రామకృష్ణ, మధు, మల్లేశ్, శేఖర్, శ్రీనివాస్, విజయ్‌కుమార్, సంతోశ్‌ఖ, దేవేందర్, గణేశ్, మురళీకృష్ణ, శ్రీశైలం, మహేశ్ ఉన్నారు.



ఆమనగల్లు: జిల్లా జడ్జి కరుణకుమార్‌ను సన్మానిస్తున్న ఆమనగల్లు జడ్జి స్వరూప